# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-02-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాలలో "మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్" కేంద్రాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **యువతలో నైపుణ్యాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**
3. **ఉభయ తెలుగు రాష్ట్రాలలో శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది.**
4. **తెలంగాణలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో సన్నరకాల వరి వంగడాల్ని సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకునేందుకు అన్ని జిల్లాలలో "మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్" కేంద్రాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో రియల్ టైం గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, వాట్సప్ గవర్నెన్స్ విధానం ద్వారా ప్రజలకు 500 సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుందని తెలిపారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకునేందుకు వీలుగా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజలకు వాట్సప్ గవర్నెన్స్ పట్ల అవగాహన కల్పించే ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

--------------------------

తెలంగాణ యువతలో నైపుణ్యాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లో పట్టభద్రులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం టాటా సంస్థతో కలిసి 65 ఐటీఐలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మార్చామని, నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామన్నారు. క్రీడల్లో యువత రాణించేందుకు

క్రీడా విశ్వవిద్యాలయాన్ని  ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..33 సెకన్లు

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సభ్యులు శాసన సభ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను చర్చకు తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ సూచించారు. అమరావతిలోని శాసనసభ మీడియా పాయింట్ వద్ద ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్... 25 సెకన్లు

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాలలో  శాసనసభ్యుల  కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం  షెడ్యూల్‌ను విడుదల చేసింది.  వచ్చే నెల  29వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లో చెరో ఐదుగురు చప్పున పది మంది ఎమ్మెల్సీల పదవీ కాలం ముగియనుంది. దీంతో ఈ  స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మార్చి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది, మార్చి 10న నామినేషన్లు, 11న పరిశీలన, 13న ఉపసంహరణ గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. మార్చి 20వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించి అదేరోజున ఫలితాలను ప్రకటిస్తారు.

కాగా మార్చి 29 నాటికి ఆంధ్రప్రదేశ్ నుంచి జంగా కృష్ణమూర్తి, పి. అశోక్ బాబు, తిరుమలనాయుడు, దువ్వారపు రామారావు, యనమల రామకృష్ణుడు పదవీ కాలం ముగియనుండగా, తెలంగాణలో సత్యవతి రాథోడ్, ఎగ్గె మల్లేశం, శేరి సుభాష్ రెడ్డి, మహమూద్ అలీ, రియాజుల్ హాసన్ పదవీ కాలం ముగియనుంది.

---------------------------

మిరప పంటకు మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం కింద  మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. క్వింటా మిర్చికి 11 వేల 781 రూపాయల ధరను ఇవ్వాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. 2.58లక్షల మెట్రిక్ టన్నుల మిరప పంట సేకరణకు అవకాశం కల్పించింది. నెల రోజులపాటు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని తెలిపింది. కాగా.. మిరప రైతులకు మద్దతు ధర కల్పించి వారిని ఆదుకోవాలని ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రానికి లేఖ రాశారు.

---------------------------

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ -ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలంగాణ రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శ్రీశైలం ఎస్ఎల్‌బీసీ  వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, సొరంగ మార్గంలో చిక్కుకున్న ఎనిమిది మందిని బయటకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

వాయిస్...31 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సన్నరకాల వరి వంగడాల్ని సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించనున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సన్నబియ్యం వంగడాల రకాలపై వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సన్నబియ్యం అందుబాటులోకి రావాలంటే పెద్ద ఎత్తున ఆయా వంగడాలను సాగు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విస్తీర్ణానికి అదనంగా 15 లక్షల ఎకరాల్లో సన్న రకాలను సాగు చేయించాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సాగు చేస్తున్న వరి రకాలు, వాటి వివరాలపై అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నంద్యాల జిల్లా శ్రీశైల మహా క్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ దంపతులు గత రాత్రి సందర్శించారు. అమరావతి నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరి శ్రీశైలం చేరుకున్నారు. గవర్నర్ కు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ దంపతులు మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.కాగా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా గత రాత్రి శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి అమ్మవార్లు పుష్పపల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు.

---------------------------

ప్రజా సమస్యలను శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు సూచించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన నిన్న సమావేశమైయ్యారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ ఉష్ణోగ్రతల కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, ఒంగోలు వంటి ప్రాంతాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు.

మరోవైపు.. తెలంగాణలోనూ ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదవుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొంది.

======================